క్లుప్తంగా

ఆలయ నిర్మాణానికి విరాళం



కమ్మర్‌పల్లి: మండల కేంద్రంలో నిర్మిస్తున్న అయ్యప్ప ఆలయం కోసం స్థానిక భక్తులు జైడి రాజేష్, జైడి గణేష్‌లు రూ.1.50 లక్షల విరాళం అందజేశారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు వారి కుటుంబ సభ్యులను సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు బద్రి, గుండోజి రవి, వేముల గంగారాం, జడల మణికంఠ, గణేష్, బద్దం రాజేష్ పాల్గొన్నారు.

ఆర్థిక సహాయం అందజేత

రుద్రూర్: రాయకూర్‌లో నిరుపేద కుటుంబానికి చెందిన నసీబ్ ఖాన్ కుమార్తె నౌషీన్ బేగం వివాహానికి రూ.10 వేలు ఆర్థిక సహాయాన్ని మంగళవారం డీసీసీ డెలిగేట్, రాష్ట్ర ఎంపీటీసీల ఫోరం మాజీ కన్వీనర్ యలమంచిలి శ్రీనివాసరావు అందజేశారు. ఆయన వెంట డీసీసీ డెలిగేట్ గంగాప్రసాద్, జిల్లా మైనారిటీ కార్యదర్శి వహీద్ హుస్సేన్, రాణంపల్లి ఎంపీటీసీ షేక్ గౌస్, బాన్సువాడ నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ కార్యదర్శి నితిన్ పటేల్, తదితరులు ఉన్నారు.

ఆలయ చైర్మన్ సాయిలు మృతి



ఎడపల్లి(బోధన్): జానకంపేట లక్ష్మి నర్సింహ స్వామి ఆలయ చైర్మన్ పురం సాయిలు మంగళవారం ఆకస్మికంగా మృతి చెందారు. సోమవారం షుగర్ లెవెల్స్ తగ్గడంతో నిజామాబాద్‌లో ప్రైవేట్ హాస్పిటల్‌లో చేర్పించారు. చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం మృతి చెందారు.

కంటి శిబిరం ప్రారంభం



డొంకేశ్వర్(ఆర్మూర్): గంగాసముందర్‌లో మంగళవారం కంటి వెలుగు శిబిరం ఏర్పాటు చేశారు. దీనిని గ్రామ సర్పంచ్ మగ్గిడి లక్ష్మి ప్రారంభించారు. తొలి రోజు 100 మందికి పైగా కంటి పరీక్షలు చేయించుకున్నారు. ఉప సర్పంచ్ ప్రవీణ్ రెడ్డి, ఎంపీపీ వాకిడి సంతోష్, మారంపల్లి ఎంపీటీసీ, పంచాయతీ కార్యదర్శి నితిన్, తదితరులు పాల్గొన్నారు.

జాగ్రత్తలు పాటించాలి



ఆర్మూర్‌టౌన్: మహిళలు ఎప్పటికప్పుడు తమ ఆరోగ్యంపై జాగ్రత్తలు పాటించాలని, ఎటువంటి ఆరోగ్య సమస్య వచ్చినా వైద్య పరీక్షలు చేయించుకోవాలని డాక్టర్ అయేషా, మానసలు అన్నారు. ఆర్మూర్ పట్టణంలోని హౌసింగ్‌బోర్డు కాలనీలో గల పట్టణ ఆరోగ్య కేంద్రంలో ఆరోగ్య మహిళ కార్యక్రమంలో భాగంగా మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. మొత్తం 132 మంది మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో పట్టణ ఆరోగ్య కేంద్రం పర్యవేక్షకుడు చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

బాన్సువాడ సెగ్మెంట్ ఓబీసీ మోర్చా కన్వీనర్‌గా నాగం సాయిలు



రుద్రూర్: పొతంగల్ మండలం హెగ్డోలి గ్రామానికి చెందిన నాగం సాయిలును బాన్సువాడ నియోజకవర్గ ఓబీసీ మోర్చా కన్వీనర్‌గా నియమించారు. ఈ మేరకు మంగళవారం కామారెడ్డి జిల్లా ఓబీసీ అధ్యక్షులు మహారాజుల మురళి నియామక పత్రాన్ని అందజేశారు. బీజేపీ జిల్లా అధ్యక్షులు అరుణ తార, బాన్సువాడ నియోజకవర్గ బీజేపీ నాయకులు మాల్యాద్రి రెడ్డి, జిల్లా ఓబీసీ ప్రధాన కార్యదర్శి శంకర్ గౌడ్, బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ కొత్త కొండ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

నందిపేట్ పట్టణానికి రూ.4.5 కోట్ల నిధులు మంజూరు



నందిపేట్(ఆర్మూర్): నందిపేట్ పట్టణంలో సిమెంట్ రోడ్లు, మురికి కాలువల నిర్మాణానికి ప్రత్యేక నిధుల నుంచి రూ.4. 5 కోట్లు ఆర్మూర్ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి మంజూరు చేశారని జెడ్పీటీసీ ఎర్రం యమున ముత్యం, మండల పార్టీ అధ్యక్షులు మచ్చర్ల సాగర్ తెలిపారు. మంగళవారం ఎమ్మెల్యేను హైదరాబాద్‌లో కలిసి సన్మానించారు. కార్యక్రమంలో ముత్యం, ఇతర నాయకులు పాల్గొన్నారు.

అధ్వానంగా బీటీ రోడ్డు

- కంకర తేలిన నూత్‌పల్లి–నడ్కుడ రోడ్డు
- ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినా మంజూరు కాని నిధులు

డొంకేశ్వర్(ఆర్మూర్): నూత్‌పల్లి–జీజీ నడ్కుడ బీటీ రోడ్డు అధ్వానంగా మారింది. దారి పొడవునా గుంతలు ఏర్పడ్డాయి. ఇటీవల కురిసిన అకాల వర్షాలకు రోడ్డు అక్కడక్కడా కొట్టుకుపోయి కంకర తేలింది. దీంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. బస్సులు ఈ రోడ్డు గుండా రావడం లేదు. నూత్‌పల్లి కమాన్ నుంచి జీజీ నడ్కుడ హనుమాన్ చౌరస్తా వరకు 3 కిలో మీటర్లు ఉన్న ఈ బీటీ రోడ్డంతా గుంతలమయంగా మారడంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. నడ్కుడ, గాదెపల్లి, చిన్నయానం, అన్నారం, సిర్పూర్ గ్రామాలకు వెళ్ల లేని పరిస్థితి ఏర్పడింది. రోడ్డుకు మరమ్మతులు చేసి దానిపై మళ్లీ బీటీ వేయడానికి ఆర్‌అండ్‌బీ అధికారులు అంచనా వేసి ప్రతిపాదనలు రూపొందించారు. ప్రభుత్వానికి పంపి రెండు నెలలవుతున్నా నిధులు మంజూరు కాలేదు. మూడు కిలో మీటర్ల రోడ్డును వేయడానికి రూ.1.32 కోట్లు కావాల్సి ఉంది. వర్షాకాలం రాకముందే బీటీ రోడ్డు పనులు ప్రారంభిస్తే బాగుంటుందని ఆయా గ్రామాల ప్రజలు అధికారులను కోరుతున్నారు.



తారు తేలిపోయిన రోడ్డు



కంకర తేలిన నూత్‌పల్లి-నడ్కుడ బీటీ రోడ్డు

తాత్కాలికంగా గుంతలను పూడుస్తాం

బీటీ రోడ్డు వేసేందుకు అంచనాలు తయారు చేసి ప్రభుత్వానికి పంపించాం. నిధులు మంజూరు కావడమే ఆలస్యం. వర్షాలకు రోడ్డు అక్కడక్కడా కొట్టుకుపోయిన మాట వాస్తవమే. నిధులు వచ్చే వరకు తాత్కాలికంగా ప్రమాదకరంగా మారిన గుంతలను పూడుస్తాం. – రఘు, ఏఈ, ఆర్‌అండ్‌బీ

నడి రోడ్డులో ఇలా.. వాహనాలు వెళ్లేదెలా?

పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని 23వ వార్డులో ప్రధాన రోడ్డు దశాబ్దాలుగా అభివృద్ధికి నోచుకోకపోవడంతో ప్రయాణికులు, కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. మామిడిపల్లి విజయ్ హైస్కూల్ నుంచి పెర్కిట్ ఎంజే ఆస్పత్రి మీదుగా 44వ నెంబరు జాతీయ రహదారిని చేరుకునే రోడ్డు పూర్తిగా ధ్వంసమై గుంతలమయంగా మారడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రత్యేక నిధులతో సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టి శాశ్వత పరిష్కారం చేపట్టాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.



మామిడిపల్లి విజయ్ హైస్కూల్ పక్కన పెద్ద గుంతతో దర్శనమిస్తున్న రోడ్డు

నిధులను పాఠశాల అభివృద్ధికి వెచ్చించాం

పెర్కిట్(ఆర్మూర్): పెర్కిట్ మోడల్ స్కూల్‌కు జిల్లా కలెక్టర్ కేటాయించిన నిధులను పాఠశాల అభివృద్ధికి వెచ్చించామని ప్రిన్సిపల్ ప్రవీణ్ కుమార్ వెల్లడించారు. నిధుల వినియోగం విషయంలో వస్తున్న ఆరోపణల నేపథ్యంలో పాఠశాలలో మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించి ప్రిన్సిపల్ మాట్లాడారు. గత సంవత్సరం కురిసిన వర్షాలకు పాఠశాల ఆవరణ జలమయం కావడంతో మొరంతో చదును చేయడానికి ఎస్‌ఎంసీ ఆధ్వర్యంలో నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రులు, ఇతర దాతల నుంచి రూ.8 లక్షల నిధులు సేకరించి పాఠశాల, హాస్టల్ ఆవరణలో మొరంతో చదును చేసినట్లు చెప్పారు. మొరం వేయడానికి రూ.11 లక్షల 50 వేలు అయినట్లు తెలిపారు. రూ.8 లక్షలను కాంట్రాక్టరుకు చెక్కు రూపంలో చెల్లించి మిగతా డబ్బులను బకాయిలుగా ఉంచినట్లు తెలిపారు. కలెక్టర్ ప్రత్యేక నిధుల నుంచి మంజూరైన రూ.4 లక్షల 71 వేలను మున్సిపాలిటీ ద్వారా పాఠశాలకు కేటాయించినట్లు తెలిపారు.



మాట్లాడుతున్న ప్రిన్సిపల్, ఎస్‌ఎంసీ కమిటీ సభ్యులు

ఆర్‌ఆర్‌ఆర్ సెంటర్ ప్రారంభం



సెంటర్‌ను ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్ పర్సన్

ఆర్మూర్‌టౌన్: మేరా లైఫ్ మేరా స్వచ్ఛ శహర్ కార్యక్రమంలో భాగంగా ఆర్మూర్ పట్టణంలోని అంగడి బజార్‌లో ఏర్పాటు చేసిన ఆర్‌ఆర్‌ఆర్ సెంటర్‌ను మున్సిపల్ చైర్ పర్సన్ పండిత్ వినీత మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ మాట్లాడుతూ.. పట్టణ ప్రజలు తమకు సంబంధించిన పాత వస్తువులను ఆర్‌ఆర్‌ఆర్ సెంటర్‌కు తీసుకొచ్చి ఇవ్వాలని కోరారు. అలాగే వార్డు అధికారులు, మెప్మా సిబ్బందికి కేంద్రం ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. కౌన్సిలర్ సుంకరి రంగన్న, మున్సిపల్, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

హామీలు విస్మరించిన బీఆర్‌ఎస్‌కు బుద్ధి చెప్పాలి

వేల్పూర్: ఎన్నికల్లో ఇచ్చిన హామీలను విస్మరించిన బీఆర్‌ఎస్‌కు ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. కోమన్‌పల్లిలో మంగళవారం నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ హాథ్ సే హాథ్ జోడో కార్యక్రమంలో ఆయన ఉపాధి హామీ కూలీలతో మాట్లాడారు. తెలంగాణ ప్రభుత్వం అధికారంలోకి వస్తే మాఫీ చేస్తామన్న లక్ష రూపాయలు మాఫీ కాలేదన్నారు. దళితులకు మూడెకరాల భూమి ఇవ్వలేదని, సొంతిల్లు నిర్మించుకుంటే ఇస్తామన్న రూ.3 లక్షలు కూడా ఇవ్వలేదన్నారు. కేసీఆర్ ప్రభుత్వం చేసిన మోసాలను గ్రహించి వచ్చే ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని కోరారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఏకకాలంలో రూ. 2లక్షల రుణమాఫీ చేస్తామని, రూ.500లకే సిలిండర్ అందజేస్తామన్నారు. వరిపంటను రూ. 2,500లకు కొనుగోలు చేస్తామని చెప్పారు. సొంతిల్లు నిర్మించుకునే వారికి ఇందిరమ్మ ఇల్లు పేరుతో రూ.5 లక్షలు అందిస్తామని చెప్పారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గడ్డం నర్సారెడ్డి, ప్రవీణ్, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మానాల మోహన్‌రెడ్డి

సమాచారం..

కొనసాగుతున్న విగ్రహ ప్రతిష్ఠాపన పూజలు



నవీపేట: మండల కేంద్రంలోని గౌడ సంఘం ఆధ్వర్యంలో నిర్మించిన రేణుక ఎల్లమ్మ, పుట్ట ఎల్లమ్మ ఆలయాల్లో జరుగుతున్న విగ్రహప్రతిష్ఠాపన ఉత్సవాలు మంగళవారం కొనసాగాయి. 150 జంటలతో యజ్ఞహోమం నిర్వహించారు. దేవతా విగ్రహాలకు జలాభిషేకం, పాలాభిషేకం నిర్వహించారు.

నూత్‌పల్లిలో హనుమాన్ విగ్రహ ప్రతిష్ఠాపన



డొంకేశ్వర్(ఆర్మూర్): డొంకేశ్వర్ మండలం నూత్‌పల్లిలో మంగళవారం 24 అడుగుల హనుమాన్ విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ఈ విగ్రహాన్ని నూత్‌పల్లి గ్రామానికి చెందిన దేగాం హన్మాండ్లు తన సొంత డబ్బులతో చేయించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు హనుమాన్ విగ్రహానికి పూజలు నిర్వహించారు.

రేణుకా ఎల్లమ్మదేవి ఆలయంలో..



ఎడపల్లి(బోధన్): మండలంలోని రేణుకా ఎల్లమ్మ దేవి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో కౌండిన్య గౌడ సంఘం సభ్యులు, గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

వైభవంగా బాలాజీ మందిర వార్షికోత్సవం



రుద్రూర్: పొతంగల్ మండల కేంద్రంలోని బాలాజీ మందిర 18వ వార్షికోత్సవ వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని రెండు రోజుల నుంచి ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేస్తున్నారు. హంపి విరూపాక్ష పీఠాధిపతి విద్యారణ్య భారతి స్వామి కార్యక్రమానికి హాజరై భక్తులకు ప్రవచనం చేశారు.

జీలుగ విత్తనాల పంపిణీ ప్రారంభం

జిల్లాలో మంగళవారం పలు చోట్ల సొసైటీల ఆధ్వర్యంలో జీలుగ విత్తనాలను ప్రజాప్రతినిధులు పంపిణీ చేశారు. 30 కిలోల బస్తా సబ్సిడీ పోను రూ.843 ధరకు ఇస్తున్నారు. అవసరం ఉన్న రైతులు తమ పట్టా పాస్‌బుక్, ఆధార్ జిరాక్స్‌తో సొసైటీలో సంప్రదించాలని కోరారు. – సాక్షి నెట్‌వర్క్



మోస్రాలో జీలుగు విత్తనాలను అందజేస్తున్న జెడ్పీటీసీ విజయభాస్కర్ రెడ్డి



రెంజర్లలో.. చైర్మన్ గంగాధర్, ఏవో రాజ్‌కుమార్

రాజ్యాంగ గ్రంథాన్ని ఉచితంగా అందించాలి



నందిపేట్(ఆర్మూర్): భారత రాజ్యాంగ గ్రంథాన్ని దేశ పౌరులందరికీ ఉచితంగా అందజేయాలని కోరుతూ మంగళవారం డీఎస్‌పీ ఆధ్వర్యంలో మండల తహసీల్దార్ అనిల్ కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు సుమన్, ప్రేమ్, శ్రీకాంత్, భూమేష్, తదితరులు పాల్గొన్నారు.

అలరించిన విద్యార్థుల నృత్యాలు



ఆర్మూర్‌టౌన్: విద్యార్థులు చదువుతో పాటు నైతిక విలువలను అలవర్చుకోవాలని సిద్ధార డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ నవీన్ యాదవ్ అన్నారు. ఆర్మూర్ పట్టణంలోని క్షత్రియ ఫంక్షన్ హాల్‌లో మంగళవారం సిద్ధార్థ డిగ్రీ కళాశాల విద్యార్థులు ఫ్రెషర్ డే వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఇటీవల విడుదలైన తెలంగాణ యూనివర్సిటీ ఫలితాలల్లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు ఘనంగా సత్కరించారు. అనంతరం విద్యార్థుల నృత్యాలు అలంరించాయి. కళాశాల పరిపాలన అధికారి రాకేష్, అధ్యాపకులు రంజిత్, మహేష్ పాల్గొన్నారు.

కనీస వేతనం అమలు చేయాలి

తమకు ఉద్యోగ భద్రత కల్పించి కనీస వేతనం చెల్లించాలని ఐకేపీ వీవోఏలు డిమాండ్ చేశారు. తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వీవోఏలు చేస్తున్న సమ్మె మంగళవారం 31వ రోజుకు చేరింది. వీవోఏలు మాట్లాడుతూ.. అర్హు లైన వారికి సీసీలుగా ప్రమోషన్ ఇవ్వాలని కోరారు. ఆర్మూర్, వర్ని, బాల్కొండ పరిధి లో వీవోఏలు సమ్మె చేసి నిరసన తెలిపారు. – సాక్షి నెట్‌వర్క్



వర్ని: సమ్మె చేస్తున్న వీవోఏలు



ముప్కాల్ మండల కేంద్రంలో ..



ఆర్మూర్ పట్టణంలో..

తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలి

బోధన్: అకాల వర్షానికి తడిసిన, మొలకెత్తిన వరి ధాన్యాన్ని తక్షణమే కొనుగోలు చేయాలని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ డివిజన్ కార్యదర్శి పుట్టవ రదయ్య డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం కొనుగో లు చేస్తామని ప్రకటించినా జిల్లా అధికార యంత్రాంగం నిర్లక్ష్యం వహిస్తోందని మంగళవారం ఆరోపించారు. రోజుల తరబడి ధాన్యం కుప్పల వద్ద రైతులు పడిగాపులు పడుతున్నారని తెలిపారు. నియోజక వర్గంలోని బోధన్, సాలూర, హున్సా సొసైటీల పరిధిలో వేల సంచుల వరి ధాన్యం రైతుల వద్ద నిల్వ ఉందని వివరించారు. తరుగు పేరుతో రైతులను దోపిడీ చేస్తున్నారని ఆరోపించారు. దెబ్బతి న్న పంటలకు నష్ట పరిహారం చెల్లించాలని, లేకుంటే ఉద్యమిస్తామని హెచ్చరించారు.

సీఎం, స్పీకర్ పోచారం చిత్రపటాలకు పాలాభిషేకం



రుద్రూర్: మోస్రా, కోటగిరి మండల కేంద్రాల్లో సీఎం కేసీఆర్, స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి చిత్రపటాలకు మంగళవారం జూనియర్ పంచాయతీ కార్యదర్శులు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జూనియర్ పంచాయితీ కార్యదర్శులు, ఔట్ సోర్సింగ్ పంచాయితీ కార్యదర్శులను రెగ్యులర్ చేయాలని క్యాబినెట్‌లో నిర్ణయం తీసుకుంటూ, విధి విధానాలను రూపొందించాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు చేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. మిఠాయిలు పంచుకున్నారు.

రెంజల్‌లో..

రెంజల్(బోధన్): మండలంలోని జేపీఎస్‌లు సీఎం చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు. రెంజల్ సర్పంచ్ మర్ల రమేశ్‌కుమార్, పలు గ్రామాలకు చెందిన కార్యదర్శులు పాల్గొన్నారు.

వేల్పూర్‌లో..

వేల్పూర్: జేపీఎస్‌లను రెగ్యులరైజేషన్ చేయడానికి చర్యలు తీసుకోవాలని ఆదేశాలు ఇచ్చిన నేపథ్యంలో సీఎం కేసీఆర్, మంత్రులు ప్రశాంత్ రెడ్డి, ఎర్రబెల్లి దయాకర్‌రావులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతూ వేల్పూర్ మండల జేపీఎస్‌లు పాలాభిషేకం చేశారు.

ప్రజా సమస్యలపై చర్చించాలి



ఆర్మూర్‌టౌన్: ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు స్పందించి ప్రజా సమస్యలపై అభివృద్ధిపై చర్చించే విధంగా సమావేశం నిర్వహించాలని బీజేపీ నాయకులు మున్సిపల్ కమిషనర్ ప్రసాద్ చౌహాన్‌కు వినతి పత్రం అందజేశారు. ఎజెండాలో 14వ అంశం రూ.10 లక్షలు మోడల్ స్కూల్‌కు మొరం కేటాయించారని పేర్కొనగా, పిల్లల నుంచి మొరం కోసం ఎందుకు చందాలు వసూలు చేశారని బీజేపీ కౌన్సిలర్‌లు ప్రశ్నించారు. మున్సిపల్‌లో జరుగుతున్న అవినీతిపై జిల్లా కలెక్టర్ స్పందించిక పోవడం సరికాదన్నారు. బీజేపీ ఫ్లోర్ లీడర్ జీవీ నర్సింహారెడ్డి, కౌన్సిలర్లు సాయి కుమార్, కొంతం మంజుల పాల్గొన్నారు.

రోడ్డు పనులు ప్రారంభం



వేల్పూర్: వేల్పూర్ నుంచి సాహెబ్‌పేట్ మీదుగా జాన్కంపేట్, తొర్లికొండ, బ్రాహ్మణపల్లి గ్రామాలను కలుపుతూ 44వ నంబరు జాతీయ రహదారిని కలుపుతూ నిర్మిస్తున్న డబుల్ రోడ్డును మంగళవారం వేల్పూర్‌లో బీఆర్‌ఎస్ నాయకులు ప్రారంభించారు. ఈ రోడ్డు నిర్మాణానికి మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి రూ. 21 లక్షలు మంజూరు చేయించారు. గత నెలలో శంకుస్థాపన జరగగా పనులు మొదలయ్యాయి. బీఆర్‌ఎస్ నాయకుల రాములు పాల్గొన్నారు

నూతన కార్యవర్గం ఎన్నిక

నవీపేట: ఆదివాసీ నాయక్‌పోడ్ సంఘం జిల్లా అధ్యక్షుడు గాండ్ల రావుచందర్ ఆధ్వర్యంలో మండల స్థాయి నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మేకల సాయిరాం, ప్రధాన కార్యదర్శిగా మెట్టు గంగాధర్, కోశాధికారిగా సాయినాథ్, ఉపాధ్యక్షుడిగా కంఠం నరేష్‌లను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రతినిధులు నర్సయ్య, దేగాం గంగసాయన్న, రమణ, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

వాటర్ లీకేజీతో వాహనదారులకు తిప్పలు



ఎడపల్లి(బోధన్) : అలీసాగర్ నుంచి నిజామాబాద్‌కు సరఫరా చేస్తున్న మంచినీటి పైపులైన్ జాన్కంపేట్ వద్ద మంగళవారం లీకేజీ అయ్యింది. మంచి నీరు రోడ్డు మీద రావడంతో వాహనాల రాకపోకలకు అంతరాయమేర్పడింది. ఈ పైప్‌లైన్‌కు కొంత కాలంగా లీకేజీలు ఏర్పడినా అధికారులు మరమ్మతులు చేపట్టలేదు. విషయం గమనించి వాటర్ సప్‌లై అధికారులు నీటిని నిలిపివేశారు. దీంతో నిజామాబాద్ నగరానికి నీటి సరఫరా జరుగుతుందా లేదా అనే సందిగ్ధత నెలకొంది.

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లీష్



పీవీఆర్ మల్టీప్లెక్స్

స్క్రీన్-1 –	కస్టడీ – 12.20, 6.30 ది కేరళ స్టోరీ (తెలుగు) – 3.30 విరూపాక్ష – 9.40
స్క్రీన్-2 –	ఫాస్ట్ ఎక్స్(తెలుగు)3డీ– 10.00, 4.00, 10.00 (ఇంగ్లీష్) 1.00, 7.00
స్క్రీన్-3 –	అన్నీ మంచి శకునములే – 11.45, 3.00, 6.15, 9.30
స్క్రీన్-4 –	బిచ్చగాడు2 – 12.15, 3.30, 6.45, 10.00

సీఎం కప్ విజేతలకు దుస్తుల పంపిణీ



వర్ని: మండలంలో ఇటీవల నిర్వహించిన సీఎం కప్ క్రీడా పోటీల్లో గెలుపొందిన విజేతలకు మండలం తరపున జర్కిన్ డ్రెస్‌లను మంగళవారం ఎంపీడీవో బషీరుద్దీన్ పంపిణీ చేశారు. క్రీడల్లో గెలుపొంది మండల టాపర్‌లుగా నిలిచిన విజేతలను జిల్లా స్థాయి పోటీలకు పంపించినట్లు ఎంపీడీవో వెల్లడించారు.

'గంగపుత్రులకు ప్రభుత్వం అన్యాయం చేస్తోంది'

డొంకేశ్వర్(ఆర్మూర్): సాంప్రదాయ మత్స్యకారులను కాదని ముదిరాజ్‌లకు మత్స్య శాఖ చైర్మన్ పదవిని ఇవ్వడం పట్ల నిజామాబాద్ జిల్లా మత్స్య పారిశ్రామిక సంఘాల మాజీ చైర్మన్ సాయిబాబా మంగళవారం ఖండించారు. ఇది రాష్ట్ర ప్రభుత్వం ఓటు బ్యాంకు కోసం చేస్తున్న రాజకీయాలని మండిపడ్డారు. రాష్ట్రంలో మత్స్య ఫెడరేషన్ ఎన్నికలు నిర్వహించకుండా గంగపుత్రులకు అన్యాయం చేస్తోందన్నారు. చైర్మన్ పదవిని రద్దు చేసి గంగపుత్రులకే ఇవ్వాలని డిమాండ్ చేశారు.